కథానిక

# తండ్రీ—కూతురూ

"తాసీరా"

నిద్రబోతున్న శ్రీమతికి హఠాత్తుగా మెలకువ కల్గింది. పది మాసాలు నిండీ నిండని పసి పిల్లాడు గట్టిగా ఏడ్వటం మొదలెట్టాడు. ఆ ఏడుపు స్వరం రెండేళ్ళ గోపాల్‌ను లేపింది. వాడూ రాగ మాలికలో ఏడ్వసాగాడు. పసిపిల్లాడికి పక్కలో సదా అమ్మ వుండాలి. అమ్మ కొంగు పట్టుకొని వుంటేగాని నిద్రబోడు.

ఏడుపు స్వరాలు వినగానే తల వెంట్రుకలు సరిచేసుకొని వెంటనే మంచంమీదనుండి దిగలేదు శ్రీమతి. ఏడ్చే పిల్లవాడిని ఎత్తుకొని, సముదాయించే కన్నతల్లి పక్కలో ఉన్నదన్న భావం చేతనేమో పసిపిల్లాడు వాడు ఏడుపును అట్లానే పొడిగించాడు గాని ఆపలేదు. కారణం అమ్మను కౌగలించుకొనే ఆ పసి చేతులు దిండును కౌగలించుకొని వున్నయి. ఆ రెండు ఏడుపులూ విని, పడుకొని నిద్రబోతున్న మిగతా ఏడుగురు పిల్లలూ లేచి ఏదో కొంపమునిగిందని చెప్పి తామూ ఏడవసాగారు. వీళ్ళ పరిస్థితి చూచి శ్రీమతికి పిచ్చెక్కినట్టయింది. ఇక వాళ్ళను సమాధాన పర్చటం రాత్రి అంతా ప్రయత్నించినా, ఒక్క శ్రీమతివల్ల కానిపని.

అంతకు ముందే చిన్నది చేసిన దీపం కాస్తా గాలికి గుటుక్కుమన్నది. అంతా కారు చీకటి. చీకట్లో గట్టిగా తేరిపార జూచింది చుట్టుపక్కలు. పిన్నిమంచం కాళీగావుంది. తండ్రిమంచం గూడా కాళీగా వున్నదా అని చూడటానికి ఇష్టంలేదు. హాలుకు ఎదురుగావున్న పడమటిల్లు తలుపులు తెరచి వుంటం ఆమె కళ్ళకు కనబడింది.

ఆ చీకట్లోనే పసిపిల్లాడిని జోకొట్టి నిద్రబుచ్చింది. మిగతావాళ్ళూ ఏడుపు మానారు. తి వ్యని స్వరంగల శ్రీమతి ఓదార్పు మాటలలో వాళ్ళ ఏడుపులు మాయమయినాయి.

ముప్పావుగంటకి శ్రీమతికి తిరిగి నిద్ర ముంచుకొచ్చింది.

శ్రీమతిగారింటికి పక్కనుండే ఇల్లు జానకమ్మది. ఊర్లో కబుర్లన్నీ ఆమె నోటంట అందరూ వినాల్సిందే. ఆమె ఇల్లు రాత్రి తొమ్మిదీతొమ్మిదిన్నరాకల్లా చర్చావేదికగా మారుతుంది. మధ్యవయస్సుగల చుట్టుపక్కల ఇళ్ళ ఆడవాళ్ళు అక్కడచేరి ఒకటే కబుర్లు చెప్పుకోటం అలవాటు. ఇటీవల మరీ శ్రీమతి గురించి ప్రస్తావన పలుసార్లు రాసాగింది.

"ఏమోనమ్మా, ఆ పిల్ల పాపం రానురాను ఎండి కట్టె అయిపోయింది. వెయ్యి చెప్పండి, కన్నతల్లే గనుక వుంటే ఇలావుంటుందా?" కరుణతో ముఖం కారిపోతున్నట్టు వాపోతుంది జానకమ్మ.

దానికి రిటైర్డు తాసీల్దారు భార్య అందుకొంటుంది.

"ఊఁ! ఆమెకేం లోటు, తినకుండా వుంటుందా, నిద్రబోకుండా వుంటుందా! అయినా దానికి ఒకటే బెట్టులేవే! మనకాలంలో ఇలాంటి పిల్లల్ని చూచి ఎరుగుదుమా? ఆ వయసుకు ముగ్గురు పిల్లల్ని కనివుండాల్సింది. ఏమంటావ్?"

"ఎవరు కాదన్నారు? ఆమెమాత్రం కనేది గాదా, పెళ్ళిచేసే కనుక వుంటే?"

"ఆఁ ఆతనికి పాపం శ్రీమతికి మొగుడిని వెదికేందుకు ఎక్కడ తీరుబాటు? సంవత్సరానికి ఇల్లాలు ఒక్కొక్కపిల్లాడి చొప్పున కంటుంటే వాళ్లకు శుశ్రూష చెయ్యటానికే సతమతమవుతుంటే."

"ఏమోనమ్మా, ఎవరెట్లాపోతే మనకెందుకు గాని, ఏంజెప్పొచ్చాననంటే అసలు ఈ కాలమే ఇట్లా మారిందనుకో. పిల్లలు ఊరికే పుట్టిపోతున్నారు! అందాకా ఎందుకూ-మనవూరు పోస్టుమాస్టరు సంగతి చెప్పరాదూ!"

"ఏమోనమ్మా, పనుంది ఇంటికి వెళ్ళాలి" అంటూ సంభాషణని అక్కడితో ఆపేసి అమ్మలక్కలు తమ ఇళ్ళకి వెళ్ళారు.

జానకమ్మ వాళ్ళు పోగానే తలుపు గడియ వేసికొని, పోయి పడుకొంది.

చీకట్లో కనుక్కున కాలు నెవరో తన్నినట్లవగా శ్రీమతి "అబ్బా!" అంటూ కొంచెం బాధగా కాలును వెనక్కు లాక్కుంది. పిన్ని వసంతలక్ష్మి వంటింట్లోకి వెళ్తూ గద్దించింది. "తాటిచెట్టులాగ కాళ్ళని అంత పొడుగ్గా చాపుకోపోతే సరిగ్గా ముడుచుకొని పడుకోకూడదూ" అర్ధరాత్రిపూట పిన్ని అధికార స్వరం విన్న తరువాత శ్రీమతి పల్లెత్తుమాట మాట్లాడలేదు.

* * *

ఉదయం తొమ్మిదయింది. రాము చొక్కా కనబడలేదు. సాంబు బడిసంచిలో గోపి తన పలక బెట్టుకొని ఇవ్వనంటున్నాడు. సరోజ, లక్ష్మి కళ్ళలోకి పెన్సిల్ ముక్కతో పొడిచి పరుగెత్తింది. గుమ్మందగ్గిర రిక్షావాడు గోలపెడుతున్నాడు. వసంతలక్ష్మి బయటనుండి "ఏమ్, శ్రీమతీ ఎక్కడ పాతుకుపెట్టుకున్నావ్? ఎంతసేపటికీ పూడిపడవేం? రిక్షా వచ్చింది. మందుసీసా ఇంకా కనబడలేదూ? నే నెప్పుడుపోయి ఎప్పుడు తిరిగివచ్చేది" అంటూ మండిపడింది.

"ఏమ్మా, శ్రీమూ, అన్నం పెట్టావా నాకు" తండ్రి మెల్లిగా ప్రేమగా అడిగాడు.

"శ్రీమతి అక్కా, దీంట్లో ఆవాలూ, దీంట్లో ఉప్పూ, దీంట్లో పంచదారా తీసుకురమ్మంది అమ్మ. దాంతో రెండు చంచాలు పంచదారయిందంటా" అంటూ వీధి చివర బడిపంతులు కడగొట్టువాడు రెండుచిన్న గిన్నెలూ, ఒక చెంచా పట్టుకొని బదులుకు వచ్చాడు.

శ్రీమతికి ఎక్కడలేని చికాకూ, అసహ్యమూ, ఏడుపూ కల్గాయి. బదులుకొచ్చిన పిల్లాడి మాటలు వినిపించుకోలేదు. పిన్ని మాటలే, చీవాట్లే మాటమాటకి ఆమెను బాధిస్తున్నాయి. చుట్టాలున్నప్పుడూ, నలుగురి సమక్షంలో ఊరికే తనను తెగ తిడ్తుంది. ఎందుకో తనంటే అంత అసహ్యం, కోపం. దానికి నాన్న పల్లెత్తుమాట పైకి అనలేడు. పిన్ని చేతుల్లో కీలుబొమ్మ అయిన నాన్నమీద శ్రీమతికి కోపంలేదు. పైగా జాలికూడా. పాపం నాన్న ఏం చేస్తాడు. ఇట్లా ఎన్నాళ్లో అనుకొని నిట్టూర్చింది మందుసీసా వెలికి పట్టుకొస్తూను.

తరువాత బదులు కొచ్చిన పిల్లవాడి సంగతి చూచి, తండ్రికి అన్నం పెట్టింది శ్రీమతి.

ఒకరోజు వెంకట్రామయ్యగారి చేతిలో ఒక చిన్న ఫోటో, ఒక ఉత్తరం ఉన్నాయి. వసంతలక్ష్మితో మాట్లాడుతున్నాడు. కూరగాయలు తరుగుతున్నట్టు వంటగదిలో ఉండి వాళ్ళమాటలు వింటున్నది శ్రీమతి.

"ఇప్పుడు ఆమెకేం తొందరొచ్చింది. పెళ్ళి చేసెయ్యాలని ఆమెగాని అన్నదేంటి? ఇదే మీతో వచ్చిన చిక్కు నాకు. సొంత బుద్ధిలేదు, చెప్పేవాళ్ళ బుద్ధిలేదు——"

"అదిగాదే, దానికి వయస్సు దాటిపోవటంలా?"

"మీకుకూడా దాటిపోతోందిగా!"

"నాకు సరేలే. పైగా అతగాడికి కొంచెంగా ఆస్తి వుంది. మంచి సంబంధం. మంచి చదువూ - మంచి ఉద్యోగం."

"ఆఁ! పెద్ద ఐ. ఏ. యస్. ఉద్యోగం. ఏదో పేరూ ఊరూ లేని కంపెనీకి మానేజరు."

"నిజమేలే. అయినా మట్టుకు పిల్లవాడు రాజా మాదిరి..."

"రాజాగానీయండి, మంత్రీ గానీయండి. నే నొప్పుకోను. రేపు నన్నే నలుగురూ అంటారు. సవతికూతుర్ని రాచి రంపానపెట్టి చివరకి ఎవడికో ముడివేసి పంపించిందని, పిసుక్కు చావాలి. ఇంతకూ పెళ్ళిఅయ్యేవేళ దానికదే తోసుకురావాలిగాని మనం అనుకున్నప్పుడు వస్తుందా?"

"అదీ నిజమేలే."

శ్రీమతి హృదయం గతుక్కుమంది. "నాన్నా, ఈ విషయంలోనన్నా పిన్నికి ఎదురు చెప్పలేవూ?" ఆమె హృదయంలోని మాటలు వెంకట్రామయ్య చెవిలో పడలేదు. పడ్డా నోరు మెదుపుతాడా, ఏనుగాన్నా?

రాత్రి శ్రీమతికి నిద్రే రాలేదు. "కన్న తల్లే వుంటే తానిట్లా వుండేదేనా!" అని వాపోయింది.

అక్కా అక్కా అంటూ ప్రాణం విడిచే రాము ఎవరికీ తెలియకుండా ఆనాడు పోస్టులో వచ్చిన ఆ ఫోటో, ఉత్తరాల్ని తీసికొచ్చి శ్రీమతికి ఇచ్చాడు.

ముందర ఆ ఫోటో చూసుకొంది శ్రీమతి. 'అహా, ఎంత అందంగా ఉన్నాడు' అనుకొంది. క్షణంలో ఆమెహృదయాన్ని పూర్తిగా ఆక్రమించు

కున్నాడు. ఆ ఫోటోని మరల మరలా చూసుకొని ఈ సంబంధం తనకు స్థిరపడకూడదూ అని అనుకొంది, కాని పిన్ని ఎట్లా పడనిస్తుంది!

ఉత్తరంలో ముత్యాల్లాగ అక్షరాలు చక్కగా స్పష్టంగా రాయబడి వున్నాయి.

"...పిల్లను చూడవల్సిన అవసరం లేదు. తెనాలి పెళ్ళికి వచ్చినప్పుడే చూశాను. ఇక మీ సమ్మతమే మిగిలి వుంది..."

శ్రీమతికి అప్రయత్నంగా ఏడుపు రాసాగింది. "పిన్నీ! నీ కన్నపిల్లల్ని ఇన్నిరోజులూ ప్రేమగా చూచుకొన్నానే దానికి ఈవిధంగానన్నా ఉపకారం చెయ్యలేవూ?" దిండులో దూది ఆమె కార్చిన కన్నీటి నన్నిటినీ పీల్చుకొని బరువెక్కింది.

* * *

పక్కయింటి జానకమ్మ ఒకనెల ఊళ్లో లేదు. తిరిగి ఊరు చేరుకొని వస్తూనే వెయ్యి ప్రశ్నలకు జవాబులు అడిగి తెల్సికొంది. ఊళ్ళో తాను లేనప్పుడు జరిగిన విషయాలు గురించి ఆ ప్రశ్నల్లో మొదటిది, "శ్రీమతి పిన్నికి పుట్టిన పదోబిడ్డ మొగా ఆడా?" అని. రెండోది "శ్రీమతికి పెళ్ళయ్యే సూచనలు ఏమన్నా కనిపిస్తున్నాయా" అనీన్నీ.

రెండు ప్రశ్నలకూ తను అనుకొన్నట్టు జవాబులు ఆమెకు లభించలేదు.

శ్రీమతి పిన్ని వసంతలక్ష్మికి ఆడపిల్ల పుట్టింది. పుట్టినప్పుడే తల్లీ బిడ్డా మరణించారు.

"ఊఁ...! ఆమెకాలం వచ్చింది. ఆమె వెళ్ళిపోయింది. ఇకనన్నా శ్రీమతికి ఒకదారి దొరుకుతుంది." తన అనుతాపాన్ని వెలిబుచ్చింది జానకమ్మ.

"బాగుంది, నీ కసలుసంగతి తెలియలేదల్లే వుంది. ఆ మొండిఘటం శ్రీమతి ఇప్పుడు పెళ్ళే వద్దంటున్నది."

"ఆఁ, అట్లాగా, ఎందుకని వద్దంటున్నది?"

"నేను అనుకొంటున్నాను; ఒకవేళ ఆ తెనాలి పిల్లవాడినేచేసుకొని తీరాలన్న పట్టుదలేమోనని."

'ఏం పాడోమరి. ఈకాలం పిల్లల మనస్సుల్లో ఏముందో మనకు తెలిసేడుస్తాది గనుకనా!" జానకమ్మ మూతి విచిత్రంగా మూడుసార్లు అటూ ఇటూ తిప్పుతూ అంది.

వసంతలక్ష్మి చనిపోయి సరిగ్గా ఆరునెలలు అయింది. వెంకట్రామయ్య ఎన్నోసార్లు శ్రీమతిని అడిగిచూచాడు. 'పెళ్ళికి ముహూర్తం పెట్టిస్తాను ఏమంటావు అమ్మా' అని ప్రేమగా అడిగినప్పుడల్లా 'వద్దు వద్దు' అన్న జవాబే శ్రీమతి యిస్తుందిగాని మరో మాటలేదు. 'పిచ్చా ఆమెకు? అన్నారంతే.

వెంకట్రామయ్యకు ఏం పాలుపోవటం లేదు. గంపెడు పిల్లల్ని కని ఆమె కాస్తా వెళ్లిపోయింది. వాళ్ళ పోషణకు కిందెట్లు మీదెట్లు అవ్వాల్సి వస్తుంది. శ్రీమతి పరిస్థితి చూస్తే అలా వున్నది.

వెంకట్రామయ్యకు సరిగ్గా నిద్రపట్టి చాలా రోజులయింది. శ్రీమతి రాత్రిళ్ళు కళ్ళు తెరచి


# ఇంజనీరింగ్ కోర్సు

ఏ. ఎం. ఐ. ఇ. (ఇండియా) పరీక్షకు చదివి ప్యాసుకండి. ఇది ఇంజనీరింగులో యూనివర్సిటీ డిగ్రీకి సమానమైనదిగా గవర్నమెంటు వారిచే రికగ్నైజు కాబడింది. ఈకోర్సు కాల పరిమితి మూడు సంవత్సరాలు. లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఇంటర్మీడియట్ పరీక్ష ప్యాసైన అభ్యర్థులు ప్రవేశమునకు అర్హులు. హాస్టలుకూడా కలదు. ప్రాస్పెక్టసుకు, దరఖాస్తు ఫారముకు ఒకరూపాయి పావలా మణిఆర్డరుద్వారా ప్రిన్సిపాల్, మద్రాసు కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్, చింతాద్రిపేట మద్రాసు-2. అడ్రెసుకు పంపండి. మణి ఆర్డరు కూపనులో మీ పేరు, అడ్రెసు విడి విడి అక్షరాలలో వ్రాయండి, (పోస్టల్ ట్యూషన్ లేదు.)

సి. జి. బిందు మాధవరావు, బి.ఎస్.సి.,బి.ఇ.,ఎ.ఎం.ఐ.ఇ. (ఇండియా). ప్రిన్సిపాల్.

కాలేజి ప్రారంభం **25-6-56** తేదీ

చూచినప్పుడల్లా తండ్రి తన మంచంమీద కూర్చుని ఏదో ఆలోచిస్తూ వుంటాడు. లేక, ఏం చడీచప్పుడూ చేయకుండా మెల్లిగా అటూఇటూ నడుస్తూఅన్నా వుంటాడు. మనశ్శాంతి బొత్తిగా లేదు. కాసేపు వుండీవుండీ ఒక పిల్లాణ్ణి తీసుకొని ఎత్తుకుంటాడు.

"నాన్నా, కాసేపన్నా నిద్రపోరాదూ" అంటుంది శ్రీమతి.

"నిద్రా తల్లీ, నాకా? రాదమ్మా. నీకు పెళ్ళి అయ్యేంతవరకూ." అంటాడు హీనస్వరంలో.

"నా కిప్పుడేం పెళ్ళి తొందర నాన్నా?"

"వయస్సు మీరిపోవటం లేదమ్మా! ఊళ్ళో నలుగురూ ఏమేమో అనుకొంటున్నారు."

శ్రీమతి గాఢంగా నిట్టూర్పు విడుస్తుంది.

పక్కయింటి జానకమ్మ రోజు శ్రీమతికి సలహా ఇస్తూ అలసిపోయింది.

"పెళ్ళి సంబంధంవాళ్ళు వచ్చి అడిగేదల్లా ఈ నాలుగు రోజుల్లోనే. వయస్సు ముదిరిపోతే ఒక్కరు గూడా తిరిగి నీ ముఖం చూడరు. అది మాత్రం నిజం. ఏమనుకొంటున్నావు?"

• • •

వెంకట్రామయ్య అఫీసునుండి ఇంటికి వస్తూ, ఆ రోజు చాలా సంతోషంగా వున్నాడు. అనాడు తనకు ఉత్తరం రాసిన ఆ తెనాలి కుర్రవాడు తన ఆఫీసులో ఇటీవల చేరటం, అతనింకా పెళ్ళి చేసుకోకుండా వుండటం అది గాగల విషయాల్ని తెలిసికొన్న వెంకట్రామయ్యకు ఇంతకన్నా ఇంకా ఏం కావాలి?

తన కూతురు ఈ సంగతి విని ఎగిరి గంతు లేస్తుందని తలంచి పరుగెత్తుకొని ఇంటికి వచ్చిన వెంకట్రామయ్య ఒక్కసారి ఆశ్చర్యంతో నిశ్చేష్టుడయ్యాడు, శ్రీమతి వాలకాన్ని చూసి.

అయితే, తండ్రి తీసికొచ్చిన వార్తనుమట్టుకు ఆమె మనస్ఫూర్తిగా గౌరవించింది.

"అయ్యో పాపం, నన్నే నమ్ముకొని అతను ఇప్పటివరకు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?" అంది.

"అది నీ అదృష్టం తల్లీ" కొంచెం తేరుకొని అన్నాడు వెంకట్రామయ్య.

"లేదునాన్నా—అది అతని దురదృష్టం!" విరక్తిగా అంది.

"నీ కేమన్నా పిచ్చా, శ్రీమూ?"

"లేదు నాన్నా, తెలివితోనే చెపుతున్నా - నాకు వద్దు పెళ్ళి."

"ఏం, ఎందుకని వద్దు శ్రీమూ పెళ్ళి? నా ప్రాణాలు తీస్తే నీకేం లాభం చెప్పు?" వెంకట్రామయ్యలోని భావనలు రోజా కంటె ఇవాళ కట్టలు తెగినాయ్.

వెక్కివెక్కి ఏడ్చింది శ్రీమతి. ఆమెవల్ల సమాధానం ఏమీ చెప్పేందుకు సాధ్యం కాలేదు.

"చెప్పమ్మా, సమ్మతమేనని చెప్పు."

"లేదు నాన్నా సమ్మతం కాదు. నేను ఇల్లు దాటి పోతే—"

"ఊఁ, పోతే ఏంటి, చెప్పమ్మా సరిగ్గా!"

"నువ్వు మళ్ళీ పెళ్ళి చేసికొంటావు నాన్నా! పిల్లల్ని చూట్టానికి ఒకతె ఇంట్లో వుండాలన్న సాకుతో తప్పక ఇంకొకామెను తెచ్చుకొంటావు. మనస్సులో వుంది చెప్పేశాను, నాన్నా! నీ గురించి నాకు బాగా తెలుసు. నేపడ్డ ఈ నరక అవస్థలన్నీ మళ్లీ ఇంతమంది పిల్లలూ పడాల్సిందేనా నాన్నా!"

"శ్రీమూ!"

వెంకట్రామయ్యకు కళ్ళవెంబడి నీళ్లు జలజల రాలసాగాయి. "ఈ పాపిని నమ్మ, శ్రీమూ. నమ్మవూ! నిజంగా ప్రమాణంచేసి చెబుతున్నా. ఇక చచ్చినా మూడో పెళ్ళి చేసికోను. నమ్మలేవా నన్ను, శ్రీమూ?"

కడేల్ కడేల్ మని తలను గోడకేసి కొట్టుకొంటున్నాడు వెంకట్రామయ్య.

అదిరిపోయిన శ్రీమతి చప్పునపోయి తండ్రిని నివారించింది.

"చెప్పమ్మా, ఇప్పుడన్నా నమ్మతానని చెప్పు! నమ్మవూ నన్ను?"

తండ్రి కన్నీరు కారుస్తూ కూతుర్ని అడిగాడు.

శ్రీమతి తండ్రిని కౌగలించుకొని వెక్కివెక్కి ఏడుస్తూ ఉండిపోయింది.

"నమ్ముతున్నా నాన్నా. నిన్ను నమ్ముతున్నా" అన్న మాటలు ఆమె నోటంట జాలిగా వెలువడ్డాయి.

(మాతృక: తమిళం) ★